విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం, సీపీఐ పార్టీలు ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేశారు.









ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

అత్తిలి: అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని మండల పరిషత్ అధ్యక్షుడు మక్కా సూర్యనారాయణ అన్నారు. అత్తిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించవద్దని అధికారులకు హితవు పలికారు. అత్తిలి కాలువకు తగిన పరిమాణంలో నీటి సరఫరాల లేకపోవడంతో సాగు, తాగునీరు సమస్య ఏర్పడుతోందని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు, వరిఘేడు ఎంపీటీసీ సభ్యుడు అనిశెట్టి త్రిమూర్తులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దంతుపల్లిలో పైపులైన్ కనెక్షన్‌లు వెంటనే ఇవ్వాలని సర్పంచ్ కోరారు. గుమ్మంపాడు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి శ్రీను తెలిపారు. అత్తిలిలో కండక్టర్స్ వైరు మార్చాలని వేలాడుతున్న వైర్లను సరిచేయాలని ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్ విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. భూసర్వేలో పొలాలతో పాటు గృహాలు సర్వే చేస్తారని తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు దారం శిరీషా, సుంకర నాగేశ్వరరావు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.


అత్తిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మక్కా సూర్యనారాయణ

జగనన్న సురక్షపై ఇంటింటా ప్రచారం

తణుకు టౌన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎంపీడీవో పీ.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం కొమరవరం గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొమరవరం, కోనాల, ముద్దాపురం, వేల్పూరు 1, 2, దువ్వ 1 గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారులకు అవసరమైన సేవలను గుర్తించి నమోదు చేసే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీలు చంద్రు శ్యామల, విజయదుర్గ, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కోనాల, ముద్దాపురం, కొమరవరం, వేల్పూరు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన సేవలకు అర్హులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.


అత్తిలిలో జగనన్న సురక్ష సర్వేను తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు

జగనన్న సురక్ష సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

అత్తిలి: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఇంటింటా సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి సీహెచ్ మురళీకృష్ణ ఆదేశించారు. శుక్రవారం అత్తిలి గ్రామంలో జరుగుతున్న ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నా రు. డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 15, 16 వార్డులలో మలేరియా మాసోత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ సబ్ యూనిట్ పరిధిలోని 161 సచివాలయాల్లో మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. దోమలు నివారణకు దోమ తెరలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం శానిటేషన్ కార్యదర్శి దుర్గ ప్రసాద్, ఆరోగ్య సహాయకులు కాంతారావు, వార్డు ఆరోగ్య కార్యదర్శులు జయశీల, ఆశలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్యవైశ్య మహాసభ ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణ ప్రముఖులు, ఆర్యవైశ్యులు మారం వెంకటేశ్వరరావు నియమితులైయారు. రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు నియామక పత్రాన్ని పట్టణంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మారం వెంకటేశ్వరరావును పలువురు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు గమిని సుబ్బారావు, వబిలిశెట్టి నటరాజు, పేరూరి కాశయ్య, పెనుగొండ శ్రీనివాసరావు, మండా ప్రకాశ్, పులవర్తి పవన్, సొలస రాజేంద్ర ప్రసాద్, మండవల్లి పాపారావు పాల్గొన్నారు.

నేడు కొమ్ముగూడెంలో ఉప ముఖ్యమంత్రి పర్యటన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో శనివారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్ తెలిపారు. ఉదయం 11 గంటలకు కొమ్ముగూడెం సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభం, 12 గంటలకు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరగనున్న అమ్మ ఒడి కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. సాయంత్రం 5.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

శ్రీ శ్రీ కళావేదిక కన్వీనర్ కొల్లి రమావతికి ఘన సన్మానం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న తాడేపల్లిగూడెంకు చెందిన, శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ సమన్వయకర్త, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతిని తెలుగు, కన్నడ కవితా గోష్టిలో ఘన సన్మానం చేశారు. ఈ సన్మానంలో ప్రపంచ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, ప్రముఖ కవయిత్రి ప్రభాశాస్త్రి, కన్నడ ప్రముఖులు సీబీకే, పాంచజన్య, శ్రీనివాస్ వాసుదేవ్, అవినాష్, కళావేదిక సభ్యులు పాల్గొన్నారు.











జర్నలిస్ట్ తులసీ చందూపై దాడిని ఖండించాలి

తణుకు టౌన్: జర్నలిస్ట్ తులసి చందూపై దాడిని వ్యతిరేకిస్తూ సామాజిక న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో పౌరసమాజం తీవ్రంగా ఖండించింది. శుక్రవారం సురాజ్య భవన్‌లో ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు.







